ఉత్తరకుమారి

శీల జగన్నాధరావు

బ్యాంక్ ఏజంటు రావుగారి ఏకైక తనయ కుమారికి బియ్యే పాసయిన దగ్గరనుంచి బొత్తిగా కాలం ముందుకు జరగకుండా వుంది ఎమ్మే చదవమన్నాడు తండ్రి "వుహుం! ఇంత చదవాలనిపించటంలేదు డాడీ" అంది కుమారి.

"కుట్లూ, అల్లికలూ నేర్చుకోవమ్మా" అంది తల్లి

"నో నో! నా కలాంటివి చిరాకు!" అంది కుమారి

"డబ్బులుపారేస్తే టైలరు కుట్టేస్తారు దానికి కష్టపడి ఎందుకు నేర్చుకోడం?" అంది విసుగ్గా

"పోనీ సంగీతం నేర్చుకోరాదుటే?" అని అనలేదు తల్లి, దండ్రి!

కుమారి గొంతులో కోయిలలు కూయవని, వీణలు మ్రోగవని, వేణువులు రవళించవని వాళ్ళకి తెలుసు!

ఇంక...వంట పూసు ఎత్తడానికే భయపడ్డారు

కుమారికి వంట గిన్నెలు చూస్తేనే చిరాకు! కడుపులోకి అన్నం వెళ్ళటం వరకే తప్ప కంచంలోనికి అన్నం ఎలా వచ్చిందన్నది ఆలోచించటానికే విసుక్కునే కుమారి, రేపు భర్తకి ఎట్లా వండిపెడుతుందని ఆ తల్లి, తండ్రి తల్చుకు వాపోయేవాళ్ళు

"ఏమిటి మీ పిచ్చి?'' అని దబాయించింది కుమారి వాళ్ళని

''అఫ్టరాల్ వంటకే అంత వర్రీ ఏమిటి మమ్మీ? వెధవది! ఓ కుక్కుని పెట్టేసుకుంటే పోయేదానికి..."

"కుక్కు కుక్కులా వుంటే పరవా లేదు, తల్లీ! వాడు వంటిల్లిపాలిటి పంది కొక్కు అయిపోతేనే చెడ్డ కష్టం!" అని విచారించింది, కుమారి తల్లి.

"ఆఁ... మీకంతా పిచ్చిభయాలు ఎంత తింటాడు?''

ఈ 'కలికాలం కంట్రీగాళ్'తో వాదించలేక నోర్మూసుకున్నారు వాళ్ళు

పన్లు చెయ్యడానికి చిరాకుపడేకుమారి బొత్తిగా ఏ పనీ లేదంటూ పూ తెగ వర్రీ అయిపోసాగింది మారేజ్ చేసేస్తామన్నారు మమ్మీ, డాడీ

"ఛ ఛ! ఇప్పట్నుంచీ మారేజ్ చేసోక్కను పెళ్ళి, కాపురం, పిల్లలూ, న్యూసెన్స్! క్కొన్నాళ్ళు పోనీ..." అని ఆర్డరు వేసేసింది కుమారి

కుమారి ''అబ్బబ్బ బొత్తిగా టైం పాసవటంలేదే!" అంటూ స్నేహితురాలు శైలజ దగ్గర రొద పెడితే, శైలజ ఆలోచించి" పోనీ బుక్సు చదూకోవే ఇన్ని పత్రికలొస్తున్నాయి! నువ్వు చదవ్వేమిటవి?" అంది.

"ఎందుకు చదవనూ? కానీ—అన్నీ చదవను—ఏవో అప్పుడూ అప్పుడూ ఓ కథా అదీ—"

''అప్పుడంటే చదువులో పడి కథలు చదవటానికి తీరుబడీ, శ్రద్ధా లేదనుకో ఇప్పుడు కావల్సినంత ఖాళీగదా?! హాయిగా చదువుకోవచ్చు ఇంకా కావలిస్తే విమర్శలు రాయి, పూసుపోతుంది

అని సలహా యిచ్చింది శైలజ

"అవును సుమా!" అనుకుంది కుమారి ఆశ్చర్యంతో, సంతోషంతో. వెంటనే వార, మాస పత్రికలన్నింటికీ చందాలు కట్టేసింది. మేడమీద, తన గదిలో ఫోమ్‌బెడ్ మీద బోర్లగిలా పడుకొని పత్రికల్ని పఠించింది ఆ తర్వాత తమ నౌకర్ని పోస్టాఫీసుకి పంపించి, కవర్లు, స్టాంపులు తెప్పించుకుంది

"సంపాదకులకు!"

పీ...మా. మాసపత్రికలో ఈ నెం కథలన్నీ ఒకదానితో ఒకటి పోటీపడినట్టున్నవి. రావ్‌గారి 'రాంభజన' మరీ మరీ చదవాలనిపించేట్టు వుంది రావ్ గారికి మీ పత్రికా ముఖంగా నా అభినందనలు అందజేస్తున్నాను...

(కుమారి, విశాఖపట్టణం)

మరో ఉత్తరం,

"ఎడిటర్ గారికి!"

ఈ వారం మీ సంపాదకీయము ఈ వీక్లీకే ఆణిముత్యము! నిజముగా జరుగుతున్నది జరుగుతున్నట్టుగా వ్రాశారు

ఇకపోతే—సీరియల్ 'జలపాతం' లో పాత్రలు అన్నియు అత్యంత సహజముగా వున్నవి. ప్రతివారము మేమంతా 'జలపాతము' లో తడిసి, వుక్కిరి బిక్కిరి అయిపోతున్నాము.

సినిమా పేజీలు బొత్తిగా ఎనిమిదే వేస్తున్నారు. రెట్టింపు చేయండి

(కుమారి, విశాఖపట్టణం)

ఇంకో లేఖ,

"చంద్రలేఖ" ఈ మధ్య అమితముగా బాగుంటున్నది! అందుకు కారణము మీరు "చంద్రలేఖ"ని తగినంత శ్రద్ధ తీసుకుని, అందముగా ఆకాశములో చుక్కలలో చంద్రునిలా అలరారేలా తయారుచేయటమే!

శీర్షికలన్నియూ బావున్నవి క్రిందటి సంచికలో, మధ్యపేజీలలో వేసిన 'గేలమ్' చిత్రం సెక్సీగా ఉన్నది ప్రముఖ హాస్యనటులు 'పాత్రం' గారితో ఇంటర్వ్యూ కడు ఆసక్తిదాయకముగా ఉన్నది

చంద్రలేఖ ఇంత బాగున్నది కనుక మీరు వెల ఇంకా పెంచినా మాకు బాధ లేదు...నా అభిమాన నటుడు 'బాబుల్' ముఖచిత్రం ఎప్పుడు వేయుదురు?

(కుమారి, విశాఖపట్టణం)

"కుమారీ!"

తల్లి పిలిచింది

"రాసుకుంటున్నానమ్మా రాసుకుంటున్నప్పుడు నన్ను పిలవకు!"

"ఏం రాతలే? కథ రాస్తున్నావేమిటేవ్??"

కుమారి మాట్లాడలేదు కూతురికి మౌనభంగంచేసి, చీవాట్లు తిననిష్టంలేక ఆవిడ వెళ్ళిపోయింది

ఓ సాయంత్రం కుమారి మూడు పత్రికలు తెచ్చి తల్లికిచ్చింది చూడమని ఆవిడ ఆత్రంగా పేజీలు తిరగేసింది. కథల దగ్గర ఎవరెవరివో పేర్లున్నాయి గాని, కుమారి పేరు లేదు "ఏదే నీ కథ?" అడిగిందావిడ!

కుమారి కాస్త ఫీలయి, నింపాదిగా ఉత్తరాల పేజీలు చూపించింది. ఆవిడ కళ్ళద్దాలు సర్దుకుని,జాగ్రత్తగాచూసింది.

"బావుందే నీ పేరు అచ్చులో..."

"నీకంతా వేళాకోళం" అని కుమారి పుస్తకాల్లాక్కుంది

"అయ్యో! ఇప్పుడు నే నేమన్నా ననే కోపం? బావులేదూ, నీ పేరు, అచ్చులో ఎవళ్ళనయినా అనమను బావులేదని?" (బావులేదన్న వాళ్ళ నా క్షణంలో చెప్పుచ్చుకొడతానన్నట్లు చూసిందావిడ)

"చక్కగా శుభలేఖల్లో వేసినట్టు వుంది..." అని "ఇదిగో పాపా! అబియ్యే కూడా పడేసుకోలేకపోయేవూ పక్కన?" అంది



"అవును సుమా!" అనుకుని,

"అయ్యో!" అని విచారించింది కుమారి "తనకింతవరకు తన పేరేగాని డిగ్రీ గుర్తు రాలేదేమిటి?" అని బాధపడింది

"భోజనానికి పదమ్మా" అన్న తల్లితో,

"ఉండు నా పేరు పక్కన బియ్యే పడేసి వస్తాను..." అంది కుమారి

* * *

"బందీ చక్రం" సీరియల్ కథ రమ్యముగా సాగిపోతున్నది ఈ వారం మరీ సస్పెన్సులో మమ్మల్ని పడవేసినారు జలజ సోపూ, టవల్సు పట్టుకుని బాత్‌రూంలోకి ప్రవేశించినది నైట్‌గౌన్ విప్పేసి, షవర్ ఆన్‌చేసినది సోపు తీసుకొని, ఇలా ఒకసారి గుండెలకి సోపు రాచుకుని, ఆ క్షణాల్లోనే తన డియర్ కల్యాణ్ జ్ఞప్తికి వచ్చి, సోపుని కల్యాణ్‌గా భావించి గుండెలకి గట్టిగా హత్తుకోబోగా, సోపు జారిపడిపోయినది! అంతే! జలజ ఇహలోకమునకు వచ్చి, కంగారుతో వెతికినది...వెతుకుతూంది సశేషం—అని అక్కడికి ఉంచేశారు

అబ్బ! అంత మంచి సస్పెన్సులో అలా వదిలేయడము బాగోలేదండీ! ఏమైంది సోపు? దొరికిందా? జలజ స్నానం చేసిందా?

ఏమయినా బాత్‌రూమ్ వర్ణనా, కల్యాణిని సోపుతో సరిపోల్చి చూపిన విధమూ చాలా బావున్నది గీతాదేవిగారి రచనాశైలి, సరస సంభాషణలు మమ్మల్ని పరవశింపజేసి ఏవో లోకాలలో విహరింపజేస్తున్నవి! వచ్చే వీక్లీకోసం ఎదురుచూస్తున్నాం

(కుమారి, బియ్యే-విశాఖపట్టణం)

* * *

రావుశ్రీ కుతూహలంగా పత్రికలో ఉత్తరాల పేజీ తీశాడు

"ఈ వారం రావుశ్రీ గారి 'మధుర ఘడియల'మంచివేగము పుంజుకున్నది. సుస్మితకు ఆ మధుర ఘడియలు త్వరలోనే వస్తాయని తలంచుచున్నాను మధుర మంజుల మనోజ్ఞముగా సాగిపోతూన్న ఈ నవలా రచయితగారికి నా అభినందనలు అందజేయండి!

(కుమారి, బియ్యేవి-శాఖపట్టణం)

'ఎవరీ కుమారి?' తలెత్తి ఆలోచనలలో పడిపోయాడు రావుశ్రీ

తన నవల శ్రద్ధగా చదువుతూ, ప్రతీ వారం వుత్తరం రాస్తుంది! తన నవలే కాదు, తను చూసే ప్రతి పత్రికలోనూ ఈ కుమారి ఉత్తరాలుంటుంటాయి!! ఇన్ని పుస్తకాలెంతో ఓపిగ్గా చదువుతూ అన్ని పుస్తకాలకి ఉత్తరాలు వ్రాసే ఆమె ఆసక్తికి, శ్రద్ధకి తను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాడు ఈ విశాఖపట్నంలోనే ఉంటుందట!! ఎక్కడ చెప్మా ??

కుమారిని కలుసుకోవాలనుకొన్నాడు రావుశ్రీ ఆమెతో సాహిత్యం గురించి మాట్లాడాలని, ఆమె అభిరుచులు వివరంగా తెలుసుకోవాలని అతని మనసు తహతహలాడింది పేరు బావుంది మనిషి రూపం ఎలా వుంటుందో ??

రావుశ్రీ పెన్నుతీసుకుని తన సీరియల్ పడుతూన్న పత్రికకి ఇలా రాశాడు వుత్తరం, ఉత్తరాల శీర్షికకి

"కుమారి బియ్యే విశాఖపట్టణం—గారికి,

మీరు నా నవలపట్ల వెలిబుచ్చి అభిప్రాయాలకి నా కృతజ్ఞతలు దయ చేసి మీ చిరునామా వివరంగా ఇవ్వండి మీతో ముఖాముఖి మాట్లాడవలె ననుకుంటున్నాను నేను విశాఖపట్టణంలోనే వుంటున్నాను..." అంటూ తన అడ్రస్ కూడా రాశాడు

కుమారి, ఈ ఉత్తరానికి జవాబేమని రాస్తుందో? అనుకున్నాడు, నవ్వుకుని

రావుశ్రీ ఉత్తరాన్ని కుమారి, శైలజకి చూపించింది

"ఎంతదృష్టం! రచయితే రాశాడే నీకు! రాయి, వెంటనే" అంది శైలజ విచ్చుకున్న ముఖంతో.

"ఏమనే? ఏం రాయనూ?"

"నీ మొహం! అలా తెల్లమొహం వేస్తావేం? నీ అడ్రసిచ్చి రమ్మని రాయి 'మీ రాకకోసం ఎదురుచూస్తున్నాను, వేయి కళ్ళతో' అని రాయి!"

"నాకేం వేయి కళ్ళు లేవు!"

"పోనీ ఆ రెండు కళ్ళతోనే!—" నవ్వింది శైలజ గలగలా

కుమారి ఇబ్బందిగా చూసింది "వస్తే ఏం మాట్లాడనే అతన్తో?"

"అదేమిటే? ఉత్తరాలంత చక్కగా రాస్తావు! మాటలాడలేవూ?" శైలజ విస్తుపోయింది



"ఏమో నాకు మాటలాడటం రాదు! అందులో అతను...మగవాడితో! శైలా ప్లీజ్! నువ్వు నా పక్కన ఉండవే, ఆ సమయంలో! నా సంగతి నీకు తెలుసుగా? అవతలివాళ్ళెమాత్రం జోరుగా మాట్లాడినా, నా నోరు దురుసుగా వచ్చేస్తుంది "

"హూఁ...సరే! అలాగే!"

రావుశ్రీ కుమారి అడ్రస్ పట్టుకుని వచ్చాడు మేడమీంచి చూస్తున్న కుమారి, శైలజ ఒకర్నొకరు చూసుకున్నారు

"అదిగో మనింటికే వచ్చాడే, ఆయనెవరో చూడు! రావుశ్రీ అయి వుంటాడు!"

ఇద్దరూ గబగబా ఎదురువెళ్ళి ఆహ్వానించారు లోపలికి

'నమస్తేలు' అనంతరం రావుశ్రీ కుమారివాళ్ళలో ఎవరయి ఉంటుందో

తేల్చుకోలేక ఇబ్బందిగా చూస్తుంటే, శైలజ కుమారి ఈమేనండీ! మీ ఉత్తరాల కుమారి! "నా పేరు శైలజ. కుమారి స్నేహితురాలిని" అంది గబగబా

పత్రికల్లో కథలమీద, నవలల మీద కుమారి రాస్తున్న ఉత్తరాల గురించి ప్రస్తావిస్తూ, ఆమె ఓపికకి, అభిరుచికి తను చాలా మెచ్చుకుంటున్నానని చెప్పాడు రావుశ్రీ తన నవల గురించి కుమారి ఏమైనా చెబుతుందేమోనని చూశాడు నిశ్శబ్దం కాసేపు రాజ్యం చేసింది. వాళ్ళ మధ్యన కుమారి శైల జనీ నేలనీ చూస్తుందేగాని, రావుశ్రీని చూడలేదు, నోరు విప్పలేదు శైలజకి వొళ్ళు మండింది ఈ నేలా తనూ ఎప్పుడూ చూసేవేగా? ఏమిటి దీని తత్వం? నోరు విప్పదేం? ఆయ నేమనుకుంటాడు!! ప్చ్!

రావుశ్రీ అనుకొనే అనుకున్నాడు హతాశుడయ్యాడు. కుమారి ఎంత చక్కగా మాట్లాడుతుందో రచనల గురించి, తన రచనల గురించి అను కుంటే... ఇదేమిటి?! ఇలా? మూగ బోయింది!!

"మీరేం మాట్లాడటంలేదు" అన్నాడు నవ్వుతూ

కుమారి అప్పటికి నోరు విప్పింది "క్షమించండి! ఏదో వుత్తరాలు రాయ డమే గాని— నాకు సాహిత్యం అంటే పెద్దగా యేం తెలియదండీ! నేనేం లోతుగా చదవను. అంటే విమ ర్శనా పూర్వకంగా "

రావుశ్రీ తన కలవరపాటుని అణచు కొని "ఓహ్! దాన్దేముందిలెండి' చదువు తూంటే విమర్శ అదే పుడుతుంది మీరు అసలేం చదివారు?" అడిగాడు కొన్ని పుస్తకాలపేర్లు చెప్పి

"వుఁహు! మీరడిగే పుస్తకాలు ఏం చదవలేదండీ!" అంది కుమారి

'ఓహ్!' అనుకున్నాడు రావుశ్రీ బాధగా ఫీలయి

తన నవలల గురించి ఇంక ఆమెని అభిప్రాయాలడగడం దండగ, అను కుని నిట్టుర్చాడు. కుమారితో వెళ్ళి వస్తా నని చెప్పి లేద్దామనుకున్నాడు కాని కుమారి విగ్రహాన్ని చూస్తూంటే అక్కడి నించి వెళ్ళిపోడానికి మనస్కరించడం లేదు. ఏదో మాట్లాడాలి! మాట్లాడకుండా కూర్చుంటే బాగుండదు! కూర్చోడమే తనకి బాగుందాయె! రావుశ్రీ కదల్లేదు

"పోనీండి! సాహిత్యం వదిలేద్దాం! ఇంకేమైనా చెప్పండి? మీరు బియ్యే చది వారా?"

"అవునండీ!"

"తర్వాత పైకి చదవకపోయారా?"

"ఏంటో! ఇంట్రెస్టు లేదు" చేతి గోళ్ళు చూసుకుంది కుమారి

"మారేజి ప్రపోజల్‌లో వున్నట్టు న్నారు" అని కొద్దిగా నవ్వాడు రావుశ్రీ



కుమారి విసుగ్గా కనుబొమలు ముడిచింది "అలా అని మీకేం తెలుసు?" అంది గభాల్న. రావుశ్రీ మొహం వివర్ణమైంది శైలజ 'అయ్యయ్యో! ఈ మనిషికి మృదువుగా మాట్లాడ్డం ఎప్పుడు వస్తుందో? ఆయనేమనుకున్నారో!' అనుకుంది బాధగా

"క్షమించండి! నేను హద్దుమీరి మాట్లాడలేదు గద?" అన్నాడు రావుశ్రీ

శైలజ ఏదో చెబుదామనుకుంటూండే కుమారి "నా మారేజ్ విషయం మా మమ్మీకీ, డాడీకే మాట్లాడ్డానికి పిలిచ్చాను! పైవాళ్ళకి ఎలా వుంటుంది ఆ అధికారం?" అంది

రావుశ్రీ మంచినీళ్ళు మింగినట్టు ఏదో మింగాడు

"అవును! నిజమే! అది మీ వ్యక్తిగత విషయం" అన్నాడు, ఏదో అనకపోతే బావుండదన్నట్టు మళ్ళా నిశ్శబ్దం ఏలింది వాళ్ళ మధ్యన కుమారి, శైలజను చూస్తూ "అదేంటో! వెధవ పెళ్ళండే నాకు చిరాకు, బాబూ! వెధవ పిల్లలూ, సంతా!. " అంది చిరాగ్గా నవ్వి

రావుశ్రీ 'వెధవ మొగుడు. అని అనలేదేం?' అనుకుని లేచిపోయాడు

"వెళతానండీ!"

శైలజ చేతులు జోడించింది కుమారి చేతులు ఎత్తలేదు అతను వెళ్ళిపోతానని అనడమే చాలన్నట్టుగా గబగబా ఇంట్లోకి వెళ్ళిపోయింది. రావుశ్రీ నిట్టూర్చి శైలజకి చెప్పి, బైటకి నడిచాడు, గబగబా ఆ తర్వాత రావుశ్రీ 'ఉత్తరాల పేజీల్ని, చూడలేదెప్పుడూ